సాక్షి తిరుపతి

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



'గ్రహణ' గమనం

చంద్రగ్రహణ సందర్భంగా ఆదివారం సాయంత్రం నుంచి ఆకాశంలో చంద్రుడు వివిధ రూపాల్లో దర్శనమిచ్చాడు. - 8లో



అర్ధరాత్రి మందులు మాయం!

డక్కిలి పీహెచ్‌సీలో ఆదివారం అర్ధరాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా మందులను తరలించారు. - 8లో



కలెక్టరేట్‌కు వెల్లువెత్తిన వినతులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి సోమవారం కలెక్టరేట్‌కు వివిధ సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. - 8లో

న్యూస్‌రీల్

రెవెన్యూ అధికారిపై విచారణకు ఆదేశం

తిరుపతి తుడా : తిరుపతి కార్పొరేషన్‌లో సుమారు 15 ఏళ్లుగా రెవెన్యూ అధికారిగా కొనసాగుతున్న సేతుమాధవ్‌పై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో వెంటనే విచారణ చేపట్టాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సేతుమాధవ్‌కు ఉద్యోగోన్నతి వచ్చినా రెవెన్యూ ఆఫీసర్ పోస్టును వదలకుండా ఉండడంపై ఇప్పటికే పలు పత్రికల్లో ఆరోపణలతో కథనాలు ప్రచురితమైనట్లు పేర్కొన్నారు. అలాగే తిరుపతి మున్సిపల్ అధికారి కేఎల్ వర్మ సైతం సేతుమాధవ్‌పై ఫిర్యాదు చేసిన విషయాన్ని కమిషనర్ పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మొత్తం వ్యవహారంపై సమగ్రంగా విచారణ పూర్తి చేసి నివేదికను త్వరితగతిన పంపించాలని కమిషనర్‌ను ఆదేశించారు.

అడుగడుగునా అలసత్వం

- ఉన్నత విద్యామండలి తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

తిరుపతి సిటీ : ఉన్నత విద్యామండలి అధికారులు అడుగడుగునా అలసత్వం వహిస్తున్నారు. డిగ్రీ అడ్మిషన్ల విషయంలో ఇప్పటికే ఆలస్యం చేశారు. ఎట్టకేలకు ప్రకియ పూర్తి చేసి విద్యార్థులకు ఆదివారం సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. సోమవారం ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తమ ఫోన్లకు ఎప్పుడు మెసేజ్ వస్తుందా అని పడిగాపులు కాశారు. విద్యామండలి అధికారులు మాత్రం నింపాదిగా సోమవారం రాత్రి సీట్లు కేటాయిస్తూ సమాచారం అందించారు. దీంతో సీట్లు పొందిన విద్యార్థులు మంగళవారం కళాశాలల్లో అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. అయితే రెండు రోజులుగా సెల్‌ఫోన్‌లను చేతపట్టుకుని మెసేజ్ కోసం ఎదురుచూస్తూ మానసిక ఒత్తిడికి గురయ్యామని విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో అయినా అధికారులు అలసత్వం వీడాలని సూచిస్తున్నారు.

'అన్నదాత'కు బాసటగా.. 'పోరు'బాట



చంద్రమౌళిరెడ్డి, వైఎస్సార్‌సీపీ వ్యవసాయ విభాగం జిల్లా అధ్యక్షుడు

చంద్రగిరి : కూటమి ప్రభుత్వ నిర్వాకంతో అవస్థలు పడుతున్న అన్నదాతలకు బాసటగా వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టిందని పార్టీ వ్యవసాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మల్లం చంద్రమౌళిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. టమాట, ఉల్లికి మద్దతు ధర లేకపోవడంతో నష్టాలపాలవుతున్నారని వెల్లడించారు. కర్షకులను పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదని ఆరోపించారు. ఈ క్రమంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. పార్టీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల సమన్వయకర్తలు అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు హర్షిత్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 27,410 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 9,656 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.39 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. ఈక్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

ఆర్చరీ జిల్లా జట్ల ఎంపిక రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీకాళహస్తిలోని ఎస్వీ ఎస్వీ డిగ్రీ బాలుర కళాశాల ఆవరణలో బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్చరీ అండర్-11, 14, 17, 19 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. మంగళవారం ఈ మేరకు శ్రీకాళహస్తి జెడ్పీ హైస్కూల్ పీడీ వెంకటరమణ తెలిపారు. పోటీలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా ప్రధానోపాధ్యాయులు జారీ చేసిన వయసు నిర్ధారణ పత్రాలను తీసుకురావాలని, ఇంటర్ విద్యార్థులు పదో తరగతి ఒరిజినల్ మార్కుల లిస్ట్ తీసుకురావాలని కోరారు. వివరాలకు 92905 02041, 70135 82801 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాడు..

విత్తనాల పంపిణీ నుంచి ధాన్యం కొనుగోలు వరకు తమదే బాధ్యత అంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. పార్టీలు, కులమతాల కతీతంగా అర్హులందరికీ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించింది. రాయితీ విత్తనాలు, ఎరువులు సకాలంలో ఆయా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసింది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించింది. కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేసి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసింది. అలాగే జిల్లాలో 100 మందికి పైగా ట్రాక్టర్లు, 70మందికి వరి కోత యంత్రాలను రాయితీతో అందించింది. 324 రైతు గ్రూపులకు మరో 14 రకాల పనిముట్లు పంపిణీ చేసింది. రబీ సీజన్‌లో 1.40 లక్షల మందికి, ఖరీఫ్ సీజన్‌లో 1.10 లక్షల మంది రైతులకు ఉచిత పంటల బీమా నమోదు చేయించింది. పంట నష్టపోయిన వారికి పక్కాగా పరిహారం చెల్లించి ఆదుకుంది.



తిరుపతి రూరల్ మండలం నెన్నూరు సమీపంలో అమ్ముడుపోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న భూమన

వ్యవసాయం.. దయనీయం



- రైతులకు చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం
- అన్నదాతలపై కూటమి నేతల పెత్తనం
- విత్తనాలు, యూరియా, డ్రోన్లు, పనిముట్ల పంపిణీలో చేతివాటం
- పచ్చమూక తాకిడికి కుదేలైన రైతాంగం
- నేడు 'అన్నదాత పోరు'కు వైఎస్సార్‌సీపీ సన్నద్ధం

కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. దేశానికి వెన్నెముకను నిర్దాక్షిణ్యంగా విరిచేస్తోంది. ఆరుగాలం కష్టించే అన్నదాతను నిలువునా దగా చేస్తోంది. వ్యవసాయం దండగ అనుకునే దుస్థితిలోకి రైతులను నెట్టేస్తోంది. కనీసం మాత్రం కనికరం లేకుండా అడుగడుగునా అవస్థల పాలు చేస్తోంది. ఈ క్రమంలోనే సకాలంలో పెట్టుబడి సాయం అందించకుండా కాలయాపన చేసింది. వేరుశనగ విత్తనాలను అప్పనంగా పచ్చమూకకు పంచిపెట్టింది. అరకొరగా యూరియాను సరఫరా చేసి కర్షకులను ఇబ్బందులకు గురిచేసింది. ఎరువుల కోసం బారులు తీరే దయనీయ పరిస్థితి తీసుకువచ్చింది. చివరకు పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో సైతం పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ మేరకు కూటమి సర్కార్ వైఖరిపై వైఎస్సార్‌సీపీ భగ్గుమంది. వ్యవసాయానికి బాసటగా నిలిచేందుకు రంగంలోకి దూకింది. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు 'అన్నదాత పోరు' కింద మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆర్డీఓ కార్యాలయాల ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించేందుకు సన్నద్ధమైంది.

సాక్షి ప్రతినిధి, తిరుపతి/తిరుపతి అర్బన్ : ఖరీఫ్ సీజన్‌లో యూరియా కోసం రైతులు నానా తిప్పలు పడుతున్నారు. అధికారుల లెక్కలు ప్రకారం జిల్లా వ్యాప్తంగా 5.5లక్షల ఎకరాలు సాగు భూమి ఉంది. ఈ సీజన్‌లో వరి 80వేల ఎకరాలు, మరో 20వేల ఎకరాల్లో వేరుశనగ, సజ్జ, రాగి, మినుములు, జొన్నలు ఇతరత్రా పంటలు సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ పరిధిలో మామిడి, నిమ్మ, మిరప, కూరగాయల తోటలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడికి యూరియా అవసరం ఉండదు. మిగిలిన పంటలకు యూరియా తప్పనిసరిగా కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం వరి పంటకు మాత్రమే 50వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం 35వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రం సరఫరా చేసినట్లు వెల్లడిస్తున్నారు. ఈ యూరియా పంపిణీలో సైతం భారీగా గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా పాస్‌పుస్తకాలు చూపిన వారికే యూరియా ఇవ్వాల్సి ఉంది. అయితే కూటమి నేతలు ఆధార్ కార్డులు చూపించి అవసరానికి మించి యూరియాను పట్టుకెళ్లినట్లు ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. అలా తీసుకెళ్లిన యూరియాను బ్లాక్‌లో విక్రయించి సొమ్ముచేసుకున్నారని ఆరోపించారు. సకాలంలో అదునుకు యూరియా వేయకపోవడంతో వరి దిగుబడి కూడా తగ్గినట్లు రైతులు వాపోతున్నారు. పాడి రైతులు పశుగ్రాసం కోసం యూరియా కావాలని ప్రాధేయపడినా కూటమి నేతలు కనికరించలేదని మండిపడుతున్నారు.



యూరియా కొరత నివారించాలని జేసీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

పనిముట్లతో సరిపెట్టి..

కూటమి సర్కార్ వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు రైతులకు ఒక్క ట్రాక్టర్, వరికోత యంత్రాన్ని కూడా రాయితీతో ఇవ్వలేకపోయింది. అక్కడక్కడ అదీ తమ పార్టీ కార్యకర్తలకు మాత్రం కేవలం 8 రకాల చిన్న చిన్న పనిముట్లు పంపిణీ చేసి సరిపెట్టేసింది. దీంతో వేలాది మంది రైతులు రాయితీ పనిముట్లపై ఆశలు వదులుకున్నారు.

తుస్సుమన్న పంట బీమా

కూటమి సర్కార్ ఉచిత పంట బీమాను రద్దు చేసింది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు, ప్రస్తుతం ప్రభుత్వ నిబంధనల మేరకు బీమా చెల్లించాలంటే రైతులే ముందుగా పంటను బట్టి నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో వరి, సజ్జ, నిమ్మ, వేరుశనగ పంటలకు, రబీ సీజన్‌లో వరి, వేరుశనగ, మామిడి పంటలు సాగుచేసిన రైతులు వాళ్లే బీమా చేసుకోవాలని సర్కారు స్పష్టం చేసింది.

కూటమి నేతలకే 'రాయితీ'

ప్రభుత్వం ప్రతి సీజన్‌లో రాయితీపై విత్తనాలు అందిస్తుంది. ప్రధానంగా వేరుశనగతోపాటు పచ్చిరొట్ట విత్తనాల్లో ప్రధానంగా జీలగలు, జనుములు, పిల్లిపెసర అందించేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 33 మండలాల్లోను సక్రమంగా పంపిణీ చేశారు. రైతుల అవసరాల మేరకు స్టాక్‌ను అందుబాటులో ఉంచేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేవలం చంద్రగిరి నియోజక వర్గానికి మాత్రం 3,270 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు ఇచ్చారు. అవి కూడా కూటమి నేతలకు మాత్రమే. ఆ నేతలు విత్తనాలను తీసుకుని చమురు ఆడించుకునేందుకు వినియోగించుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతులను ముంచేసిన ప్రభుత్వం

రామచంద్రాపురం : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయం కుదేలైందని, రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్‌సీపురం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. క్షేత్రస్థాయిలో రైతులను కలుసుకున్నారు. ఎరువుల కొరత, గిట్టుబాటు ధర లేకపోవడం, సాగు ఖర్చులు భరించలేక పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని, బస్తాను రూ.400 నుంచి రూ.600 విక్రయిస్తున్నారని రైతులు వాపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులే మిగులుతున్నాయని గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన భూమన మాట్లాడుతూ రైతు క్షేమంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అన్నదాత సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వం బాధ్యతని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టే అన్నదాత పోరులో ఈ సమస్యలను బలంగా వినిపిస్తామని భరోసా ఇచ్చారు. రైతుల కోసం పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. అనంతరం రైతులతో కలసి బస్తాల్లో ధాన్యం నింపారు. అన్నదాత ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యమని, ఆ మేరకు వైఎస్సార్‌సీపీ సైనికులుగా చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు.

శిక్షణ పొందా.. డ్రోన్ ఇవ్వలేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023 మే 16వ తేదీన డ్రోన్ పైలెట్‌గా పనిచేయడానికి గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీలో 12 రోజులు శిక్షణ ఇచ్చారు. ఆ మేరకు సర్టిఫికెట్ అందించారు. డ్రోన్లు నడపడానికి పూర్తిస్థాయిలో తర్ఫీదు పొందా. 90శాతం రాయితీతో నాకు డ్రోన్ వస్తుందని ఆశపడ్డా. 10 శాతం నగదును కూడా సిద్ధం చేసుకున్నా. అయితే కూటమి ప్రభుత్వం వేరే వాళ్లకు ఇచ్చింది. నాతోపాటు శిక్షణ పొందిన వారికి కూడా మొండి చేయి చూపింది.

– నక్కా శోభనబాబు, పెద్ద పాండూరు, వరదయ్యపాళెం మండలం

ఆదుకోవడం లేదు



యూరియా కొరత అంశం ఒక్కటే కాదు. రైతులకు అవసరం అయిన మేరకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వడం లేదు. దీంతో అధిక ధరలు చెల్లించి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. అవి నాణ్యత లేకపోవడంతో మొలకలు రావడం లేదు. వేరుశనగ కాయలను మాకు చూపించడం కూడా లేదు. కూటమి నేతలు సిఫార్సు చేసిన వారికే పంపిణీ చేస్తున్నారు. కనీసం పచ్చిరొట్ట విత్తనాలను రాయితీల్లో ఇవ్వకపోవడం బాధాకరం. వేల సంఖ్యలో రైతులు ఉంటే నామమాత్రంగా కొందికే ఇచ్చి పంపించేస్తున్నారు. ఈ ప్రభుత్వం రైతులను ఏమాత్రం ఆదుకోవడం లేదు.

– వెంకటయ్య, రైతు, వెంకటగిరి నియోజకవర్గం

నేడు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను రాజకీయ కోణంలో చూడడం మొదలైంది. మనకు ఓటేశారా.. మన పార్టీకి సంబంధించిన వాడేనా అంటూ ఆరా తీయడం ప్రారంభమైంది. కొన్నిచోట్ల 'ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశావు కదా' అంటూ నేతలే ప్రశ్నించి రైతులకు అందాల్సిన రాయితీలు అందకుండా అడ్డుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో పెట్టుబడి సాయం మొదటి ఏడాది ఎవరికీ ఇవ్వలేదు. రెండో ఏడాది రూ.5వేలు విదిలించారు. జిల్లా వ్యాప్తంగా 32వేల మందికి ఎగనామం పెట్టారు. విత్తనాలు, ఎరువులను తూతూ మంత్రంగా పంపిణీ చేసి చేతులుదులిపేసుకున్నారు. పంటకు గిట్టుబాటు ధర లేకుండా రైతులను దగా చేశారు.

విత్తనాల ఊసేలేదు



యూరియా కోసం రైతులు తంటాలు

సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల మాట్లాడుతూ వరి సాగు చేయవద్దని రైతులకు ఉచిత సలహా ఇచ్చారు. వరి సాగు చేయవద్దన్నప్పుడు ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని 28 మండలాలకు వేరుశనగ విత్తనాల ఊసేలేకుండా చేశారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 12వేల హెక్టార్లు ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో కేవలం 5వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేయడం గమనార్హం.

36 డ్రోన్లు సైతం తమ వారికే..

అగ్రికల్చర్ చదువుకున్న వారికి 2023లో డ్రోన్ల వాడకంపై గుంటూరులో శిక్షణ ఇచ్చారు. వారికే 90శాతం రాయితీలో డ్రోన్లు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే గతంలో శిక్షణ పొందిన వారికి కాకుండా, చదువుతో సంబంధం లేకుండా 36 డ్రోన్లు 80శాతం సబ్సిడీతో అధికార పార్టీ అనుయాయులకే కట్టబెట్టినట్లు సమాచారం. గతంలో శిక్షణ పొందిన వారికి మొండిచేయి చూపించారు.

సేవలు దూరం



గతంలో రైతు భరోసా కేంద్రాలు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. విత్తనాలు, ఎరువులతోపాటు పంటల సాగుపై సలహాలు సైతం అందించేవారు. కూటమి సర్కార్‌లో రైతు సేవాకేంద్రాలు మార్చారు. మళ్లీ రేషన్‌లైజేషన్ పేరుతో 50శాతం కేంద్రాలను తగ్గించారు.వాటిలో కూడా అగ్రికల్చర్ అసిస్టెంట్లను మరో 50శాతం తగ్గించారు. రెండు రైతు సేవా కేంద్రాలను ఒక అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు అప్పగించారు. దీంతో సేవలు దూరం అవుతున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగు భూములు సైతం బీడు భూములుగా మారుతున్నాయి.

– మధురెడ్డి, రైతు, చిల్లకూరు మండలం

డప్పు కళాకారుల సంక్షేమమే లక్ష్యం

తిరుపతి కల్చరల్ : డప్పు కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని దళిత డప్పు కళాకారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కుమార్‌రెడ్డి, మార్పెళ్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఏపీ ఫౌండేషన్ కార్యాలయంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డప్పు కళాకారుల సంఘం నేతలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం డప్పు కళాకారులను ప్రత్యేకంగా గుర్తించి 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేసిందని, ఇప్పుడు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయగా, ప్రస్తుతం అవి చెల్లవంటూ ఇబ్బంది పెట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలోని డప్పు, డ్రమ్స్, పంబ, జముకులు, తీన్మార్ వంటి 18 నుంచి 70 ఏళ్ల వరకు కళాకారులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే డప్పు కళాకారులకు కూడా పింఛన్‌ను రూ.5 వేలకు పెంచాలని కోరారు. డిసెంబర్‌లో రాష్ట్ర స్థాయి మహాసభ ఏర్పాటు చేసి డప్పు కళాకారుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి పరసారత్నం, నేతలు మురగారెడ్డి, పి.రెడ్డెప్ప, అంజయ్య, మురళి, సహదేవయ్య, వెంకటేష్, రామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమార్‌రెడ్డి

పటిష్టంగా 20సూత్రాల అమలు

తిరుపతి అర్బన్ : స్వర్ణాంధ్ర-2047లో భాగంగా 20 సూత్రాలను పటిష్టంగా అమలు చేయాలని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్‌ఓ నరసింహులుతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్, అమృత 1.0, విద్యా, వైద్య, ఉపాధిహామీ శాఖలకు సంబంధించి చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి లక్ష్యం వికసిత్ భారత్ 2047, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష స్వర్ణాంధ్ర-2047 నెరవేర్చే దిశగా పని చేయాలని సూచించారు. అమృత పథకంలో భాగంగా పట్టణాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలని కోరారు. ఇందుకోసం మంజూరైన నగదును సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

శ్యామలరావును సాగనంపారు!

- టీటీడీ ఈఓ బదిలీ
- చైర్మన్‌తో విభేదాలే కారణమా?
- నూతన ఈఓగా అనిల్‌కుమార్ సింఘాల్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : మహాభారతంలో కర్ణుడి చావుకి సవాలక్ష కారణాలు అన్నట్టు.. టీటీడీ ఈఓ శ్యామలరావును సాగనంపేందుకు సైతం పలు సాకులు ఉన్నాయని ఉద్యోగుల్లో చర్చసాగుతోంది. ఈఓ శ్యామలరావును బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేయడంతో టీటీడీ సిబ్బందిలో చర్చ మొదలైంది. చైర్మన్‌తో తలెత్తిన అంతర్గత విభేదాలే ఈ ఉత్తర్వుల వెనుక కీలకపాత్ర పోషించినట్లు పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మేరకు ఈఓపై బదిలీ వేటు పడుతుందని కొంతకాలంగా టీటీడీలో జోరుగా ప్రచారం సాగుతోందని వెల్లడిస్తున్నారు.

వివాదాస్పద నిర్ణయాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీటీడీ ఈఓగా శ్యామలరావును నియమించారు. తదనంతరం ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు టీటీడీ వివాదాస్పదంగా మారాయని ఉద్యోగులే చెబుతున్నారు. ఈ క్రమంలోనే తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనకు టీటీడీ పాలక మండలి, అధికారుల మధ్య సమన్వయ లోపమే కారణమంటూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బహిరంగంగానే చేసిన విమర్శల విషయం అందరికి తెలిసిందే. తిరుపతి ఘటన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన సమీక్షలో టీటీడీ చైర్మన్, ఈఓ మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయిలో వాగ్వాదం జరిగింది. దీంతోనే ఇరువురి నడుమ అంతర్గత విభేదాలకు బీజం పడిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

అనిల్‌కుమార్ సింఘాల్ నియామకం



తాజాగా కూటమి ప్రభుత్వం 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో టీటీడీ ఈఓ శ్యామలారావును సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అనిల్‌కుమార్ సింఘాల్‌ను ఈఓగా నియమించింది. సింఘాల్‌కు గతంలో రెండు పర్యాయాలు టీటీడీ ఈఓగా పనిచేసిన అనుభవం ఉండడం గమనార్హం.

పకడ్బందీగా 'మిషన్ శక్తి'



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మిషన్ శక్తి పథకంపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నిశాఖల సమన్వయంతో పటిష్టంగా మిషన్ శక్తిని అమలు చేయాలని కోరారు. సమాజంలో ఆడబిడ్డలపై సాగుతున్న అఘాయిత్యాలు, అన్యాయాలపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు, బాలికల సాధికారతే లక్ష్యంగా సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా 12వ తేదీ వరకు మిషన్ శక్తి చేపట్టాలని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ కృష్ణ మంజరి, నోడల్ ఆఫీసర్ వాసంతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీజీ అడ్మిషన్లకు ఆన్‌లైన్ అవస్థలు

తిరుపతి సిటీ : పీజీసెట్–2025 కౌన్సిలింగ్ ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించినట్లు ఉన్నత విద్యామండలి అధికారికంగా ప్రకటించింది. దీంతో జిల్లాలోని అన్ని నెట్ సెంటర్ల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు బారులు తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసినా వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యామండలి అధికారుల వ్యవహారశైలిపై మండిపడ్డారు. జిల్లాలో పీజీ అడ్మిషన్లకు సంబంధించి సోమవారం కనీసం 120 మంది విద్యార్థుల రిజిస్ట్రేషన్ కూడా కాకపోవడం గమనార్హం.

గుండెపోటుతో భక్తుడి మృతి


కుప్పకూలిన మధుబాబు

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలో సోమవారం ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు.. హైదరాబాద్ కు చెందిన మధుబాబు(52) ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చారు. చంద్ర గ్రహణం సందర్భంగా ఉపవాసం ఆచరించి సోమవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ క్రమంలో ఆలయం నుంచి బయటకు వస్తూ ప్రసాదాల కౌంటర్ వద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అధికారులు వెంటనే స్పందించి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధుబాబు మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ గోపి వెల్లడించారు.

శ్రీవారి సేవలో ఆర్మీ అధికారి


శ్రీవారి ఆలయం వెలుపల ధీరజ్‌సేథ్

తిరుమల : తిరుమల శ్రీవారిని సోమవారం ఆర్మీ లెఫ్టినెంట్ కమాండర్ ధీరజ్‌సేథ్ సేవించుకున్నారు. అయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

'గ్రహణ' గమనం


ఆదివారం సాయంత్రం పున్నమి చంద్రుడు


రాత్రి 11:55 గంటలకు సంపూర్ణ గ్రహణం


రాత్రి 12:40 గంటలకు


గ్రహణం వీడి వెన్నెల కురిపిస్తూ..

అడుగడుగునా జల్లెడ

- తిరుమలలో ముమ్మరంగా తనిఖీలు
- పలు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల పరిశీలన

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకండా తిరుమలలోని వివిధ శాఖల అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం స్టెరిలైజేషన్, ఎక్సైజ్, జాయింట్ టీమ్ ఇన్‌స్పెక్షన్‌కు శ్రీకారం చుట్టారు. పోలీసులు, విజిలెన్స్, బాంబ్ స్క్వాడ్, రెవెన్యూ, ఫారెస్ట్, ఫైర్, ఎలక్ట్రికల్, హెల్త్ అధికారులు రంగంలోకి దిగారు. సుమారు 38 మంది రెండు బృందాలు విడిపోయి ఉదయం 7.30 నుంచి సాయంత్రం 3 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. జీఎంసీ టోల్‌గేట్ నుంచి అలిపిరి వైపుగా 9 కిలోమీటర్ల మేర అడుగడుగునా జల్లెడ పట్టారు. ఆయా మార్గాల్లో మొత్తం 150 షాపులను తనిఖీ చేశారు. దుకాణాల్లో సీసీ కెమెరాలను, తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. షాపుల్లో పనిచేసే సిబ్బంది వివరాలను ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌లో తెలపాలన్నారు. అనధికార హాకర్లను తిరుపతికి తరలించారు. అలాగే నడకమార్గంలోని మరుగుదొడ్లు, డస్ట్‌బిన్‌లు, కల్వర్టులను బాంబ్ స్క్వాడ్ తనిఖీ చేసింది. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు స్టెరిలైజేషన్ బృందాలు అప్రమత్తంగా పనిచేస్తుంటాయని అధికారులు వెల్లడించారు.

కొండపై క్యూల పరిశీలన

తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీలు నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్‌లోని ఆక్టోపస్ సర్కిల్ నుంచి ఈఎస్‌ఐ వన్ గేట్ వరకు క్యూలను పరిశీలించారు. గరుడ సేవ రోజున భక్తులకు ఇబ్బందులు లేకుండా పలు సూచనలు చేశారు. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా సాగేలా ప్రతి విభాగం పని చేయాలని ఆదేశించారు.


నడక మార్గంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు


తిరుమలలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ


సీపీఆర్ విధానం చూపుతున్న వైద్యులు

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ ప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ ట్రీట్మెంట్ , సీపీఆర్ చేసే విధానంపై పోలీసులకు అవగాహన కల్పించారు.

తిరుపతికి మూడు జాగిలాలు


పోలీస్ జాగిలాలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

నూతనంగా మూడు జాగిలాలు పది నెలల పాటు ట్రైనింగ్ తీసుకుని జిల్లాకు చేరుకున్నాయి. వీటిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం పరిశీలించారు. జోన, వేగ, సిరి పేర్లు ఈ జాగిలాలు డ్యూయల్ ట్రైనింగ్, సబ్జెక్ట్, నార్కోటిక్స్, గంజాయి ట్రాకింగ్‌లో పూర్తిస్థాయిలో శిక్షణ పొందినట్లు ఎస్పీ వెల్లడించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జనంద కుమార్, ఏఆర్‌పీసీలు తిమ్మయ్య, రావణ్ వర్మ, రెడ్డి ప్రకాష్, శ్రీనివాసులు హ్యాండ్లరుగా ఉన్నారని వివరించారు. ఈ జాగిలాల సేవలను శ్రీవారి బ్రహ్మోత్సవాల బందోబస్తులో భాగంగా వినియోగించనున్నట్లు తెలిపారు.

నగల దుకాణంలో చోరీ యత్నం


స్థానికుల అదుపులో నిందితురాలు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని దర్గా వీధిలోని ఓ నగల దుకాణంలో ఇద్దరు మహిళలు చోరీకి యత్నించారు. షాపు యజమాని కనిపెట్టడంతో అక్కడ నుంచి పరుగులు తీశారు. స్థానికులు వెంబడించి ఓ మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. చోరీకి యత్నించిన మహిళలకు తిరుపతికి చెందిన వారుగా గుర్తించారు.

పాము కాటుకు మహిళ మృతి

కేవీబీపురం : మండలంలోని మిద్దికండ్రిగలో సోమవారం పాముకాటుకు ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. గ్రామానికి చెందిన మంగమ్మ (44) సజ్జ కోతకు వెళ్లింది. పంట కోస్తున్న సమయంలో గుడ్డి పింజరి పాము కరిచింది. తోటి కూలీలు వెంటనే ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మంగమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శనలో కళాకారులు

వెంకటగిరి రూరల్ : పోలేరమ్మ జాతరను పురస్కరించుకుని సోమవారం రాత్రి పట్టణంలో భద్రాచలం కళాకారులు ప్రదర్శించిన నృత్యం అలరించింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఈ మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించి నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. పోలేరమ్మతల్లి ఆలయం నుంచి కళాకారులు నృత్యం చేసుకుంటూ రాజావీధి, కాశీపేట, పాత తహసీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్ వరకు ముందుకు సాగారు.

కలెక్టరేట్‌కు వెల్లువెత్తిన వినతులు


అధికారులకు వినతిపత్రం అందిస్తున్న మైనారిటీ నేతలు

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వినతులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై 238 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు హాజరై వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినతులను నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం విభిన్నప్రతిభావంతులు శ్రీదేవి, రాజమ్మ, మునికృష్ణారెడ్డికి మూడు చక్రాల సైకిళ్లు, టి.సుచీంద్రకు ట్రైసైకిల్, మురళికి కర్రలను పంపిణీ చేశారు.

గౌరవ వేతనం కోసం నిరసన

వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జోనల్ అధ్యక్షుడు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇమామ్‌కు రూ.10వేలు,మౌజన్‌కు రూ.5వేలు ప్రతినెల క్రమం తప్పకుండా ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వంలో 12 నెలలుగా మొండిచేయి చూపిస్తున్నారని మండిపడ్డారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు అధికారులకు వినతిపత్రం అందించారు. మైనారిటీ విభాగం నేతలు షేక్ కాసిమ్, షేక్ ఖాదర్ బాషా, పఠాన్ ఫరీద్, చాంద్ బాషా, ఇమ్రాన్ బాషా,, షేక్ గఫూర్, మస్తాన్, వహీద్, షరిమ్మల షేక్, సనాల్లాహ్ షేక్, అమీర్ భాయ్, షేర్ ఖాన్,సలీం పాల్గొన్నారు.


తమ ఫించన్ పెంచాలంటూ విచ్చేసిన వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు

పింఛన్ పెంచండి

ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో మృత్యువుతో పోరాటం చేస్తున్నామని...తమకు రూ.4 వేల నుంచి రూ.15 వేలకు పింఛన్ నగదు పెంచాలని పలువురు దివ్యాంగులు కోరారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

ఉపాధిలో మస్టర్ మాయాజాలం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

డక్కిలి : డక్కిలి పంచాయతీలో చేపట్టిన ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు గ్రామస్తులు సోమవారం తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందించారు. పంచాయతీలోని నరసనాయుడుపల్లె, కందలవారిపల్లె, వెంపటవారిపల్లె, అత్తల సిద్దవరంలో ఉపాధి పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. కూలీల ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ, పనులకు వెళ్లని వారికి కూడా మస్టర్ వేస్తూ అవినీతి తెరతీస్తున్నట్లు ఆరోపించారు.

బోగస్ బాగోతం

డక్కిలి గ్రామంలోని కొంతమంది ఉపాధి పనులకు వెళ్లకపోయినా వారి పేర్లతో మస్టర్లు జనరేట్ అయినట్లు గ్రామస్తులు వెల్లడించారు. . డక్కిలి గ్రామంలో 20292, 20293, 20299, 20300, 20306, 10005, 10052, 10082, 10083, 10194, 20286 నంబర్లు కలిగిన జాబ్‌కార్డుదారులు ఒక్క ఉపాధి పనికి కూడా వెళ్లరని, అయితే వర్క్ కోడ్ 0209034009 నంబర్ మీద మంజూరైన పనికి వీరంతా హాజరైనట్లు మస్టర్లు నమోదు చేశారని వివరించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


ఫొటో మార్ఫింగ్ చేసిన మస్టర్


బోగస్ మస్టర్ ఇదే

వెట్టిచాకిరీ నుంచి విముక్తి

గంగాధర నెల్లూరు: వెట్టి చాకిరీ నుంచి ఓ కుటుంబానికి అధికారులు విముక్తి కల్పించారు. వివరాలు.. పెనుమూరు మండలం, పూనేపల్లి గ్రామానికి చెందిన నందిని కుటుంబ సభ్యులు జీడీ నెల్లూరు మండలం, కోటగరం పంచాయతీ, ఎట్టెరి గ్రామానికి చెందిన ఓ సిమెంట్ ఇటుకల వ్యాపారి వద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నారు. దీనికి బదులుగా గత ఏడాది పాటు తా కుటుంబాన్ని పెట్టి చాకిరీ చేయిస్తున్నాడు. నందిని కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్డీఓ శ్రీనివాసులు సోమవారం బాధితులను కలిసి సమస్యలపై ఆరా తీశారు. సదరు యజమానితో మాట్లాడి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించారు.

ఎర్రమట్టి..కొల్లగొట్టి!


టిప్పర్లకు గ్రావెల్ మట్టిని నింపుతున్న హిటాచీలు

పాలసముద్రం: మండలంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. కొండలు, గుట్టలు కొల్లగొడుతోంది. అందినకాడికి ఎర్ర గావెల్‌ను తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటోంది. దీనిపై ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతోంది. స్థానిక ప్రజాప్రతినిధి అండతో మరింత రెచ్చిపోతోంది. మండలంలోని వనదుర్గాపురం రెవెన్యూ లెక్కదాఖాల జగనన్న కాలనీ సమీపంలోని గుట్టపై కన్నేసింది. తలసిందే తడువుగా హిటాచీలు దించేసింది. పదుల సంఖ్యలో ఎర్రగ్రావెల్‌ను నింపి లారీలను సరిహద్దు దాటించింది. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు తొమ్మిది టిప్పర్లు, రెండు హిటాచీలను సీజ్ చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

అసలేం జరిగిందంటే!

మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ, జగనన్న కాలనీకి ఆనుకుని గుట్టలున్నాయి. దాదాపు ఏడాదిన్నరగా ఈ గుట్టల్లోని మట్టిని తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ గ్రావెల్‌ను రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు.

వాహనాలు సీజ్

వనదుర్గాపురం గుట్టలో ఎర్రమట్టి తీసుకెళ్తున్నట్టు సమాచారం అందుకున్న తహసీల్దార్ అరుణకుమారి, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తవ్వకాలు, వాహనాలకు సరైన రికార్డులు లేకపోవడంతో తొమ్మిది టిప్పర్లు, రెండు హిటాచీలను సీజ్ చేశారు. తమిళనాడు టిప్పర్లకు అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని ఎస్‌ఐ తెలిపారు.

అర్ధరాత్రి మందులు మాయం!

- అనుమతులు లేకుండా తరలింపు
- 104 డ్రైవర్ నిర్వాకం



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న మందులు ఇవే..

డక్కిలి : ప్రజారోగ్య రక్షణకు వినియోగించాల్సిన మందులను ఆదివారం అర్ధరాత్రి మాయం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా 104 డ్రైవర్ అక్రమంగా మందులను ట్రాక్టర్ తరలించిన వ్యవహారం సోమవారం ఉదయం వెలుగుచూసింది. వివరాలు.. డక్కిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలకు 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ మేరకు పీహెచ్‌సీ గోడౌన్‌లో మందులను నిల్వ చేస్తుంటారు. అయితే 104 డ్రైవర్ వెంకటరమణ ఎవరికీ చెప్పకుండా, వైద్యాధికారికి కనీస సమాచారం ఇవ్వకుండా మందులను ట్రాక్టర్ ట్రాలీలో లోడ్ చేసుకుని వెళ్లిపోయాడు. ఈ విషయం గమనించిన స్థానిక యువకులు ట్రాక్టర్‌ను వెంబడించారు. మందులను ఎక్కడకు తరలిస్తున్నారని ప్రశ్నించారు. అవి కాలం చెల్లిన మందులని, నిమ్మ చెట్లకు చల్లేందుకు తీసుకెళుతున్నానని డ్రైవర్ సమాధానమివ్వడంతో కంగుతిన్నారు.

పక్కదారి పట్టిన సేవలు?

మందుల అక్రమ రవాణాపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. గత మూడేళ్లగా 104 సిబ్బంది అవసరం లేకపోయినా రూ.లక్షలు విలువైన మందులను ఓ కంపెనీ నుంచి ఆర్డర్ ద్వారా తెప్పిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి పీహెచ్‌సీకి కావాల్సిన మందులను ఇండెంట్ పెట్టుకుని వైద్యాధికారి అనుమతులతో తీసుకురావాల్సి ఉంటుంది. కానీ, ఈ పీహెచ్‌సీ సిబ్బంది మాత్రం నిబంధనలకు గాలికి వదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరాలకు మించి మందులు తెప్పిస్తున్నట్లు తెలిసింది. దీంతో వచ్చిన మందుల్లో ఎక్కువ శాతం ప్రజలకు చేరకుండానే కాలం చెల్లుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో 104 డ్రైవర్ తరలించిన మందుల్లో అయితే కొన్ని బాక్సులు కనీసం సీల్ కూడా తీయలేదని వెల్లడిస్తున్నారు. మొత్తం వ్యవహారం గమనిస్తే.. వైద్యాధికారి పర్యవేక్షణలో సాగాల్సిన 104 సేవలు పూర్తిగా పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశముంది.

సమాచారం లేదు



104 సేవలకు వినియోగించాల్సిన మందులను పీహెచ్‌సీ గోడౌన్ నుంచి డ్రైవర్ వెంకటరమణ తరలించినట్లు గుర్తించాం. దీనిపై మాకు సమాచారం ఇవ్వలేదు. కాలం చెల్లిన మందులను బయో వేస్టేజీ వారికి అప్పగించాలి. వాతావరణం కలుషితం కాకుండా గుర్తించిన ప్రదేశంలో వాటిని కాల్చివేస్తారు. ఈ మేరకు డ్రైవరు వెంకటరమణపై ఉన్నతాధికారులుకు ఫిర్యాదు చేస్తాం.

– శ్రీహరి, వైద్యాధికారి, డక్కిలి